జనం మధ్య పాదయాత్ర నిర్వహిస్తున్న నారా లోకేష్

ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకించండి

- కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల రాస్తారోకో

ప్రజాశక్తి -కర్నూల్ కలెక్టరేట్

తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఉన్న విశాఖ ఉక్కును ప్రవేటికరించాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు, ఎఐటియుసి, ఎస్‌యుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎండి.అంజిబాబు, మునెప్ప, నాగన్న డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని అధికార ప్రతిపక్ష పార్టీలను కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కర్నూలు కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేశారు. సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సాయిబాబా, ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ 32 మంది ఆత్మ బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేటుకరించడం ఏమాత్రం సరైనది కాదని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని ఎనిమిది వందల రోజులుగా కార్మికులు ఉద్యమం చేస్తుంటే ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్లడం సరికాదని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని వారు అన్నారు. నరేంద్ర మోడీ అదానికి విశాఖ ఉక్కును కారుచౌక్కగా కట్టబెట్టాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. నరేంద్ర మోడీ చేస్తున్న విధానాలు సరైనవి కావని వారన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజల పక్షమా మోడీ పక్షమా తేల్చుకోవాలని కోరారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ఏకం కావాలని కోరారు. టిడిపి జనసేన పార్టీలు విశాఖ ఉక్కు కోసం ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. లక్ష మంది ఉద్యోగులు విశాఖ ఉక్కును ఆధారం చేసుకుని జీవిస్తున్నారని అటువంటి స్టీల్ ప్లాంట్‌ను అమ్మడం సరైనది కాదన్నారు. రాస్తారోకోకు సంఘీభావం తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను కారు చౌకగా అమ్మడం సరైంది కాదన్నారు. ఈ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు ప్రజలు మద్దతు తెలియజేయాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు కార్మిక సంఘాల మద్దతుతో పోరాడి విజయం సాధించాయని అదే స్ఫూర్తితో కార్మికులు రైతులు కలిసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ విశాఖపట్నం పోరాటానికి సంపూర్ణ మద్దతు రైతులు తెలియజేస్తున్నారని తెలిపారు ఉద్యమానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు బి.రామాంజనేయులు, ఎఐటియుసి జిల్లా నాయకులు మనోహర్ మాణిక్యం, నగర కార్యదర్శి చంద్రశేఖర్, సిఐటియు జిల్లా నాయకులు జె.నాగేశ్వరరావు, ఎం. గోపాల్ నగర నాయకులు టి.రాముడు, నరసింహులు, సుధాకరప్ప, యేసు, ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, నగర నాయకులు మహమ్మద్ షరీఫ్, మహమూద్ పాల్గొన్నారు.

రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉత్సాహంగా యువగళం

- కోడుమూరు నుండి పాణ్యం నియోజకవర్గంలోకి

ప్రజాశక్తి - కోడుమూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉత్సాహంగా సాగింది. 88వరోజు పాదయాత్ర కోడుమూరు శివారు నుంచి ప్రారంభం కాగా, కోడుమూరులో యువనేతకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వివిధ వర్గాల ప్రజలు అడుగడుగునా నారా లోకేష్ ను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. రోడ్డుకి ఇరువైపులా లోకేష్ ని కలిసేందుకు ప్రజలు బారులు తీరారు. తనని కలవడానికి వచ్చిన యువత, మహిళలు, వద్దులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి, పన్నులు విపరీతంగా పెంచేశారు. చెత్త పన్ను కట్టాలని వేధిస్తున్నారు. కట్టకపోతే ఇంట్లో ఎదైనా సంక్షేమ కార్యక్రమం వస్తే అందులో కట్ చేసుకుంటున్నారని మహిళలు ఆవేదన చెందారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పన్నుల భారం, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని లోకేష్ భరోసా ఇచ్చారు. స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకుంటున్నామని యువకులు లోకేష్ కు తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాకి పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి స్థానికంగా ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. పాదయాత్ర దారిలో బుడగ జంగాలు, రాయలసీమ మాదిగ దండోరా నాయకులు, చేనేతలు, కోడుమూరు మండల రైతులు, ప్రజలు యువనేతను కలిసి తమ సమస్యలను విన్నవించారు. రాబోయే చంద్రన్న ప్రభుత్వం అందరికీ అండగా నిలుస్తుందని చెప్పి ముందుకు సాగారు. అనుగొండ శివార్లలో భారీ వర్షంలో సైతం యువనేత పాదయత్రను కొనసాగించారు. రేమండూరు వద్ద యువగళం పాదయాత్ర పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పాణ్యం ఇన్ చార్జి గౌరు చరితారెడ్డి నేతత్వంలో యువనేతకు అపూర్వస్వాగతం లభించింది. 88వరోజు లోకేష్ 15.9 కిలోమీటర్ల దూరం నడిచారు ఇప్పటివరకు యువగళం పాదయాత్ర 1135.6 కి.మీ పూర్తయింది.

లోకేష్‌కు గౌరు దంపతుల స్వాగం

పాణ్యం నియోజకవర్గం రేమడూరు గ్రామంలోకి నారా లోకేష్ యువగలం పాదయాత్ర ప్రవేశించింది. అక్కడ టిడిపి పాణ్యం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టిడిపి నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, జిల్లా, నియోజకవర్గం, మండల నాయకులు కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు.

పేరుకు మాత్రమే సంక్షేమ పథకాలు...

- ప్రజలకు ఒరిగింది శూన్యం - వివిధ రకాల భారాలతో జనం ఉక్కిరిబిక్కిరి

- 2024లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయం - టిడిపి నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డితో ముఖాముఖి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

'రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేరుకు మాత్రమే ఉన్నాయి. ప్రజలకు ఒరిగింది శూన్యం. నిత్యావసర వస్తువుల ధరలు పెంచారు. దీంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. 2024 జనరల్ ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయం.' అని టిడిపి నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్ర పాణ్యం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో గౌరు వెంకటరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి....

నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఎలా కొనసాగుతోంది?

గౌరు: నారా లోకేష్ యువగళం పాదయాత్ర అనంతపురం జిల్లా నుంచి డోన్ నియోజకవర్గంలో ప్రవేశించినప్పుడు అసెంబ్లీ ఇన్చార్జిలు అందరూ ఘన స్వాగతం పలికారు. 14 నియోజకవర్గాల ఇన్చార్జుత అభిప్రాయాల మేరకు పాదయాత్ర కొనసాగుతోంది. ప్రస్తుతం కోడుమూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న పాదయాత్ర ఈనెల 4న పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం రేమడూరు గ్రామంలో ప్రవేశిస్తుంది. తొలి రోజు రేమడూరు, పుసులూరు, బొల్లవరం, బస్తిపాడు, చిన్నకొట్టాల, పెద్దకొట్టాల, మార్కాపురం వరకు సాగుతుంది. రెండో రోజు మార్కాపురం గోకులపాడు స్టేజి సల్కాపురం నెరవాడస్టేజి పెద్దపాడు వరకు కొనసాగుతుంది. పెద్దపాడు సమీపంలో బహిరంగ సభ ఉంటుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి విజయం పార్టీ శ్రేణులపై ఎలాంటి ప్రభావం ఉంది?.

గౌరు: పశ్చిమ రాయలసీమ పట్టబద్దులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి విజయం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. నాలుగేళ్ల వైసిపి పాలనపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేసింది. ఈ ఎన్నికల్లో గ్రామస్థాయి పార్టీ శ్రేణులు కూడా అభ్యర్థి విజయానికి ఎంతో కృషి చేశారు. ఇదే పరంపరను వచ్చేఅసెంబ్లీ ఎన్నికల్లోను కొనసాగిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలపై మీ అభిప్రాయం ఏమిటి?

గౌరు: వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో డొల్లతనం కనపడుతుంది. డాక్టర్ వైఎస్ రాజ శేఖర్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల కోవలోనే జగన్ నవరత్నాలు ఉంటాయని భావించిన ప్రజల ఆశలు అడి యాశలయ్యాయి. టిడిపి ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను పంపిణీ చేయ డంలో వైసిపి ప్రభుత్వం విఫలమైంది. ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొ రేషన్ల స్థానంలో తీసుకువచ్చిన కులాల కార్పొరేషన్లు నిధులులేక దిష్ట బొమ్మలయ్యాయి. అమ్మ ఒడి లబ్ధిదారులకు 12 రకాల నిబంధనలు పెట్టి అర్హులకు పథకాన్ని దూరం చేశారు. పీజీ కోర్సుకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వనందున పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

పరిశ్రమలు నిరుద్యోగం అంశాలపై మీ అభిప్రాయం ఏమిటి?

గౌరు: నాలుగేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడంలో ముఖ్యమంత్రి విఫలం చెందారు. ఉన్న పరిశ్రమలను వెళ్లగొట్టేందుకు వైసిపి నాయకులు ఎన్నో అడ్డంకులు సృష్టించారు. టిడిపి ప్రభుత్వంలో జిల్లాకు వచ్చిన జల, సోలార్, విండ్ విద్యుత్ ప్రాజెక్టులకు చంద్రబాబు రూ.వందల కోట్లు నిధులు కేటాయించారు. వైసిపి ప్రభుత్వంలో ఆప్రాజెక్టులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

2024లో టిడిపి భవిష్యత్తు ఎలా ఉంటుంది?

గౌరు: 2024లో అసెంబ్లీ ఎన్నికలలో టిడిపి విజయఢంకా మోగి స్తుంది. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయం. 2014లో పాణ్యం నియోజకవర్గంలో నాటి ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి చేసిన అభివృద్ధి ఫలాలే 2024 లోను అండగా నిలిచి టిడిపి జెండా ఎగురవేయడం ఖాయం. ఇరిగేషన్ పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. కల్లూరు అర్బన్ 16 వార్డులలో రెగ్యులర్‌గా తాగునీటిని సరఫరా చేస్తాం. నిరుద్యోగ సమస్య పరిష్కారం పై దృష్టి పెట్టి పరిశ్రమలు స్థాపిస్తాం. పర్యాటక అభివృద్ధిని విస్తృతం చేస్తాం.

మీ రాజకీయ ప్రస్థానం ఎలా సాగింది. ?

గౌరు: నందికొట్కూరు మండలం బ్రహ్మణకొట్కూరు మా స్వగ్రామం. మా గ్రాండ్ ఫాదర్ గౌరు ఈశ్వర్‌రెడ్డి నాటి నందికొట్కూరు రాజ కీయాలలో బైరెడ్డి శేషశైనారెడ్డి, గిడ్డారెడ్డిలతో కలిసి ప్రధాన భూమిక పోషించారు. నేను1994లో కాంగ్రెస్ నాయకులు గిడ్డారెడ్డితో కలిసి రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నాను. డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత కాంగ్రెస్‌పార్టీ నుంచి వైసిపిలోకి వచ్చాను. ఈ క్రమంలో 2014లో పాణ్యం అసెంబ్లీ నుంచి గౌరుచరితరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకున్నాం. 2019ఎన్నికలకు ముందు జరిగిన రాజకీయ పరిణామాలలో భాగంగా టిడిపిలోకి వచ్చాను.

కర్ణాటక సరిహద్దులోని

మద్యం దుకాణాలు బంద్

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని మద్యం దుకాణాలను ఈనెల 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కర్ణాటక రాష్ట్రంలో ఈనెల 10న శాసనసభ నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికలు జరుగుతున్నందున శాంతి భద్రతల కొరకు ఈనెల 8న సాయంకాలం 6 గంటల నుండి పదవ తేదీ సాయంకాలం 6 గంటల వరకు కర్నూలు జిల్లాలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని ఐదు కిలోమీటర్ల లోపల ఉన్న మద్యం షాపులను మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ , ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.

లోకాయుక్త వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

లోకాయుక్త కార్యాలయానికి సంబంధించి అధికారిక వెబ్‌సైట్‌ను జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ లోకాయుక్త కార్యాలయానికి సంబంధించి అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించామని, గతంలో ఉమ్మడి రాష్ట్రాలకు సంబంధించి ఒకే అధికారిక వెబ్‌సైట్ ఉండేదని, కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఈ రోజు అధికారికంగా ప్రారంభించామన్నారు. ఈవెబ్‌సైట్‌లో లోకాయుక్తకు సంబంధించి నియమ నిబంధనలు గురించి పూర్తి స్థాయిలో వివరాలు ఉంటాయని వివరించారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లోకాయుక్త సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతును పర్యవేక్షిస్తున్న డాక్టర్ కె. వేణుగోపాల్

విద్యార్థినిలకు ప్రత్యేక శిక్షణా తరగతులు

ప్రజాశక్తికర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో మొత్తం 26 కెజిబివిలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం , రెండవ సంవత్సరాలలో 438 మంది ఫెయిల్ అయ్యారని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె. వేణుగోపాల్ పేర్కొన్నారు. అలాంటి విద్యార్థినిలకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థినులకు జిల్లాలో 5 కెజిబివిలలో రెమిడియల్ తరగతలు ప్రారంభమయ్యాయన్నారు. ఆదోని జనరల్, ఆస్పరి, కోడుమూర్, గూడూర్, కల్లూరు. రెమిడియల్ తరగతులు సప్లిమెంటరీ పరీక్షలు పూర్తయ్యే వరకు నిర్వహిస్తారు. రాష్ట్ర కార్యాలయం నుండి వచ్చిన ప్రణాళిక మేరకు బోధనా, స్టడీ అవర్స్ నిర్వహిస్తారన్నారు. జిల్లా లోని కెజిబివిలలో ఫెయిల్ అయిన విద్యార్థినులు తమకు కేటాయించిన రెమిడియల్ కోచింగ్ సెంటర్లలో హాజరు అవ్వాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలని రెమిడియల్ కోచింగ్ సెంటర్లకు పంపించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ముగిసిన టెక్ ఎక్స్‌పో

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న టెక్ టెక్‌ఎక్స్‌పో కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ జివిఎం. మోహన్ కుమార్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై.పాండురంగయ్య పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువే కాకుండా ఇతర అంశాలపై కూడా దృష్టి సారించాలన్నారు. క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాలు వాటిపై కూడా మక్కువ పెంచుకోవాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ డీన్ గిరిధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే ఆరోపణలకు ఆధారాలు చూపాలి : వైసిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

యువగళం పాదయాత్రలో భాగంగా కోడుమూరు బహిరంగ సభలో నారాలోకేష్ వైసిపి నేతలపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు బివై.రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జిల్లాపార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బివై. రామయ్య మాట్లాడుతూ ఎవరో బుర్రలేని వ్యక్తి స్క్రిప్ట్ రాసిస్తే అందులో నిజమెంతో తెలుసుకోకుండా చదవడంలోకేష్ అవివేకి అనడానికి నిదర్శనమన్నారు. కోడుమూరులోఎమ్మెల్యే, ఇంచార్జీపైనారా లోకేష్ చేసిన ఏ ఒక్క ఆరోపణకైనా ఆధారాలు చూపించే దమ్ము టిడిపి నేతలకు ఉందా అని నిలదీశారు. మాజీ కేంద్రమంత్రి కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి టిడిపిలో చేరేటప్పుడు విడుదల చేయించుకున్న జీవోలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ఆయన సొంత నియోజకవర్గం కోడుమూరుకు కోట్ల ఏం చేశారో చెప్పాలన్నారు. చంద్రబాబు 14 ఏళ్లలో కర్నూలు జిల్లాకు ఏం చేశారో, వైసిపి ప్రభుత్వం 4 ఏళ్ళలో ఏం చేశారో బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. టిడిపి నేతలే డేట్, టైం, ప్లేస్ దమ్ముంటే చెప్పాలని మరోసారి సవాల్ విసిరారు. లోకేష్ వ్యాఖ్యలకు నిరసనగా కోడుమూరులో ఎమ్మెల్యే సుధాకర్ శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అరెస్టు చేశారని, ఇది పోలీసులకు ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛ, ప్రభుత్వ ఆదర్శపాలనకు నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ దళితులపై లోకేష్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెబితే కోడుమూరు నియోజకవర్గంలోకి స్వాగతం పలుకుతామని, లేదంటే నిరసన వ్యక్తం చేస్తామని 5 రోజుల ముందే చెప్పామన్నారు. దీనికి సమాధానం చెప్పకుండా తనపై అవినీతి ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నిజంగా తాను అవినీతికి పాల్పడితే వైసిపి వ్యతిరేక మీడియా ఎందుకు చూస్తు ఉంటుందని ప్రశ్నించారు. పసుపులలో టిడిపి ఎంపిటిసికబ్జాచేస్తే తనకు అంటగట్టడం ఏంటన్నారు. 8 ఎకరాల గంగమ్మ చెరువును కబ్జా చేసింది మీ పార్టీ వారు కాదా అని నిలదీశారు. తొలిశాపురంలో 90 ఎకరాల భూమిని కబ్జా చెసింది టిడిపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో కొత్తపల్లి బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయని, 22 కోట్లతో గోరంట్ల బ్రిడ్జి పూర్తైందని, టిడిపి నేతలు ఇవ్వన్నీ దాచి లోకేష్‌కు స్క్రిప్ట్ ఇచ్చి ఆయనను నవ్వులపాలు చేస్తున్నారన్నారు. కోడుమూరుకు33 కోట్లు, గూడూరుకు 53 కోట్లు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందన్నారు. ఎదురూరు గ్రామంలో దేవాదాయ శాఖ భూమిని టిడిపి నేత విష్ణువర్ధన్ రెడ్డి కబ్జా చేసింటే, తాను ప్రత్యేక చొరవ తీసుకుని గుడి నిర్మాణానికి కృషి చేస్తే కోర్టులో కేసు వేసి విష్ణువర్ధన్ రెడ్డి అడ్డుపడింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బివై.రామయ్య

జర్నలిస్టులను సన్మానిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

మానవ హక్కులకు పత్రికా స్వేచ్ఛ చోదకశక్తి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పత్రికా స్వేచ్ఛను శక్తివంతమైన ఆయుధంగా తీర్చిదిద్దినప్పుడే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ సీనియర్ వైద్యులు శంకర్‌శర్మ తెలిపారు. బుధవారం కర్నూలు కలెక్టర్ కార్యాలయం సమాచార శాఖ కార్యాలయంలో ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా సీనియర్ విలేకరులను డాక్టర్ శంకర్ శర్మ శాలువా కప్పి పూల బొకే ఇచ్చి ఘనంగా సన్మానం చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు ప్రధాన ధ్యేయమని తరాల హక్కులను పరిరక్షించేందుకు పత్రికా స్వేచ్ఛ చోదక శక్తిగా నడుం బిగించేందుకు అందరూ తోడ్పాటు అందించాలని కోరారు. పత్రికా స్వేచ్ఛకు పట్టంగట్టాలన్న స్ఫూర్తితో 1997 మే 3న పత్రికా స్వేచ్ఛ అవార్డును ప్రదానం చేయడం కారణమన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ప్రసార మాధ్యమాలు 2030 సుస్థిరాభివద్ధి లక్ష్యాల తోడుగా నిలువాలని తెలిపారు.

సమ్మర్ కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి

కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి -కర్నూలు క్రైం

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకుని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్ ఖాన్ సూచించారు. బుధవారం కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీలోని ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయ ప్రాంగణంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని వివిధ స్టంట్‌ల ద్వారా ప్రదర్శించారు. ప్రజాశక్తి ఎడిషన్ ఇన్‌ఛార్జ్ పానుగంటి చంద్రయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ మాట్లాడుతూ.... వేసవిలో విద్యార్థులు సమయం వృధా కాకుండా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. తైక్వాండో శరీర ధారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి, ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేసవిలో క్రీడాకారుల క్రీడలను మరింత దగ్గరగా పరిచయం చేయడం కోసం వైసిపి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందన్నారు. విద్యార్థులు యువత క్రీడల్లో రాణించాలన్నారు. తైక్వాండో కోసం అవసరమైన ప్రత్యేక మ్యాట్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని త్వరలోనే వాటిని కూడా పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ క్యాంపునకు పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, కోచ్ షబ్బీర్ హుసేన్‌ను ఆయన అభినందించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిఇఒ పివి.రమణ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 50 సమ్మర్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో క్యాంపు నిర్వహణకు రూ.7 వేలు కేటాయించినట్లు చెప్పారు. అందులో రూ.4,500 స్పోర్ట్స్ మెటీరియల్‌కు, రూ.2 వేలు కోచ్ గౌరవవేతనానికి, మిగిలిన మొత్తాన్ని సర్టిఫికేట్ల కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు. వేసవిలో పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, డివిఎంసి సభ్యులు ప్రభుదాసు, వైసిపి 47 వార్డు ఇన్‌ఛార్జీ స్వేతారెడ్డి, జర్నలిస్టు మునిస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిపిఒ పివి.రమణ

ఉపాధి పనులను పరిశీలించిన వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలను విడుదల చేసి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామ ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలు నెలల తరబడి పనులు చేసినా వారం వారం బిల్లులు చెల్లించకపోతే కూలీలు పస్తులు ఉండి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో ఏ వారం ఏ రోజు ఎంత కూలి పడినది తెలిసే అవకాశం లేక కూలీలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉపాధి హామీ రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాడుతుందని వ్యవసాయ కూలీలందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.ఎ.రమేష్, మేట్లు వెంకటేశ్వర్లు , మధు, నరేష్, మహేష్, రఘు, రాధా, కూలీలు పాల్గొన్నారు.

సొంత భవనం ఆనందంగా ఉంది

- గుమ్మనూరు శ్రీనివాసులు

- ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - హోళగుంద

ప్రాథమిక సహకార సంఘం కార్యాలయ నిర్మాణ పనులకు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరుడు, దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం భూమి పూజ చేశారు. ప్రాథమిక సహకార సంఘం ఏర్పడినప్పటి నుంచి ఇంతవరకు మండలంలో సొంత భవనం లేక పాతబడిన భవనాల్లో సంఘం లావాదేవీలు జరిపేవారు. కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో జిల్లా సహకార సంఘం వారు అప్పుగా సొంత కార్యాలయం నిర్మాణం కోసం రూ.11 లక్షలు మంజూరు చేసినట్లు ప్రాథమిక సహకార సంఘం ఛైర్మన్ మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేడు కార్యాలయానికి భూమి పూజ చేసి సొంత కార్యాలయం నిర్మించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సిఇఒ నీలకంఠ స్వామి, మెంబర్లు డి.లక్ష్మి, ఎం.సహేరాభాను, వైసిపి నాయకులు శేషప్ప, మల్లికార్జున, రామకృష్ణ, కుమారస్వామి, వైసిపి ఆలూరు మండల కన్వీనర్ వీరేష్, విక్రాంత్ రెడ్డి, ఉరుకుందప్ప, కించప్ప పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న శ్రీనివాసులు

పథకాలు, అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న వివిధ సంక్షేమ పథకాల తీరు, నాడు - నేడుతో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులను ఎమ్మిగనూరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి, డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య, గోనెగండ్ల మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వరలక్ష్మి పరిశీలించారు. బుధవారం గోనెగండ్లలో పర్యటించి సచివాలయం-2ను సందర్శించి సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ బస్టాండు ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులు జరుగుతున్న విధానం, పురోగతిపై సూచనలు చేశారు. ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో అన్ని సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించి సమీక్షించారు. మండల ప్రత్యేకాధికారి వరలక్ష్మి స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అన్ని సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని, పేదలందరికీ ఇళ్లలో భాగంగా కేటాయించిన స్థలాల్లో లబ్ధిదారులందరూ గృహాలు నిర్మించుకొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎఒ బాబు భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు - నేడు పనులను పరిశీలిస్తున్న అధికారులు

జగనన్న గృహ నిర్మాణాలు తలమానికం

- ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

జగనన్న కాలనీల్లో నిర్మాణం అవుతున్న గృహాలు ఆ గ్రామాలకే తలమానికంగా రూపుదిద్దుకుంటున్నాయని వైసిపి చిప్పగిరి కన్వీనర్, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. బుధవారం బంటనహాల్ గ్రామంలో జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకొని గృహ ప్రవేశం నిర్వహించుకుంటున్న గోవిందు ఆహ్వానం మేరకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నారాయణ చేతులమీదుగా రిబ్బన్ కట్ చేయించి గృహ ప్రవేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో జగనన్న కాలనీలో పట్టాలు పొందిన ప్రతి లబ్ధిదారుడు కూడా త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి నిరుపేదకూ సొంత ఇల్లు ఉండాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలాగా ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, వైసిపి నాయకులు పరమేష్, సతీష్, రంగన్న పాల్గొన్నారు.

గుమ్మనూరు నారాయణను సన్మానిస్తున్న

వ్యవసాయ మార్కెట్ యార్డులో శుభ్రత శూన్యం

- శుభ్రత కోసం వేల రూపాయలు డ్రా..!

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిశుభ్రత పేరుతో రూ.వేలు కాజేస్తూ పరిశుభ్రత పాటించడం లేదు. ఇదే వ్యవసాయ మార్కెట్ యార్డులో కూరగాయల మార్కెట్ ఉండడం వల్ల అక్కడక్కడ మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. నెలకు రూ.74 వేలు మార్కెట్ యార్డు సెక్రటరీ బినామీ పేరుతో టెండర్ వేయించి ఆయనకు నెలకు రూ.2 వేలు ఇచ్చి మిగతా రూ.72 వేలు కాజేస్తూ పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. ఏకంగా తన కార్యాలయం ముందు నీరు నిల్వ ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు విచ్చలవిడిగా రైతులను మోసం చేస్తున్నా నామమాత్రపు తనిఖీలు చేపట్టి వారి అక్రమాలను కపి పుచ్చడానికి వాటా తీసుకొని దర్జాగా కార్యాలయానికి వచ్చామా..! వెళ్లామా అన్న విధంగా అధికారులు ప్రవర్తిస్తున్నారు. పత్తి జిన్నింగ్ ట్రేడర్స్ వారి దగ్గర పత్తి బేల్‌కు రూ.5 వేలు తీసుకొని లారీలను పర్మిట్ లేకుండా పంపిస్తున్నారు. ఈ అవినీతి డబ్బులు డిడిఎం, జెడిఎంలకు కూడా అందుతున్నట్లు సమాచారం. వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులను అనేక రకాలుగా మోసం చేస్తున్నప్పటికీ అవినీతి నిరోధక శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డుపై నిఘా ఉంచడం లేదు. రైతులకు జరుగుతున్న అన్యాయాలను నిరోధించాలని రైతులు కోరుతున్నారు.

కార్యాలయం ముందు నిలిచి ఉన్న వర్షపు నీరు

సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

మండల ప్రత్యేకాధికారిగా నారాయణ మూర్తి

- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం మండల ప్రత్యేకాధికారిగా ఎ.నారాయణ మూర్తి నియమితులయ్యారు. బుధవారం మంత్రాలయం చేరుకున్న ఆయన ప్రభుత్వం నుంచి మంజూరైన సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధిపై ప్రతి బుధవారం సమావేశంలో చర్చించి నివేదిక ద్వారా కలెక్టర్‌కు పంపుతామని తెలిపారు. స్పందన, నాడు-నేడు, జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల వివరాలు, తాగు నీటి సరఫరా తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకుంటామని చెప్పారు. లబ్ధిదారులు, ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. తహశీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌ఛార్జీ ఎంపిడిఒ ప్రభావతి, గృహ నిర్మాణ శాఖ డిఇ లాలి కృష్ణయ్య, ఎపిఒ తిమ్మారెడ్డి, ఎపిఎఒ జయశ్రీ పాల్గొన్నారు.

ఇంటర్ తప్పిన విద్యార్థులు

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- కళాశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యం

ప్రజాశక్తి - చిప్పగిరి

మార్చిలో ఇంటర్ పరీక్షలు రాసి తప్పిన విద్యార్థులకు ప్రభుత్వం శిక్షణ తరగతులను నిర్వహించుకోవడానికి వెసలుబాటు కల్పించిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం చిప్పగిరి కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం తప్పిన వారందరూ ఉదయము, సాయంత్రం జరిగే తరగతులకు హాజరు కావాలని కోరారు. తరగతులు ఈ నెల 20 వరకు జరుగుతాయన్నారు. పరీక్షలు రాసేవారు తక్షణమే ఫీజులు చెల్లించాలన్నారు.

నాణ్యమైన విత్తనాల పట్ల అవగాహన అవసరం

- ఎడిఎ విజయమోహన్ కుమార్

దేవనకొండలో రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ

ప్రజాశక్తి- దేవనకొండ

ఈ ఏడాది వ్యవసాయ ఖరీఫ్ సీజన్‌కు గాను మండలంలో రైతులకు నాణ్యమైన విత్తనాల పట్ల అవగాహన కల్పించేలా రైతు భరోసా కేంద్రం అగ్రికల్చర్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలని పత్తికొండ వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ మోహన్ కుమార్ సూచించారు. బుధవారం దేవనకొండ రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ... జూన్ నెల ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో నకిలీ, లూజు పత్తి విత్తనాల పట్ల అప్రమత్తతతో ఉండి రైతులు వాటి పట్ల ఆకర్షణకు గురికాకుండా నాణ్యమైన విత్తనాలు సీడ్ దుకాణాల్లో తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎఒ సురేష్ బాబు, ఎఇఒలు యోగి, జయరాం, రంగన్న పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- కోచింగ్ సెంటర్ మాస్టర్ కేశవ్

- ఫ్రీ సెల్ఫ్ డిఫెన్స్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆదోని

క్రీడలతోనే మానసికోల్లాసం పెంపొంది ఆరోగ్యంగా ఉంటారని కళాభారత్ నైపుణ్యత శిక్షణ కోచింగ్ సెంటర్ మాస్టర్ కేశవ్ తెలిపారు. బుధవారం ఆదోని పట్టణంలోని బాలికల ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాస్టర్ కేశవ్ మాట్లాడారు. ఈనెల చివరి వరకు ఉదయం, సాయంత్రం చిన్నారులకు యోగా, కరాటే, డ్యాన్స్, బాక్సింగ్, కర్ర సాములో శిక్షణ ఇస్తున్నామన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులు దృఢత్వం కలిగి ఉండేలా ప్రతేడాది కళాభారత్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా మారెమ్మ అవ్వ దేవర

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు గ్రామంలో శ్రీమారెమ్మ దేవరను గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం అమ్మవారికి కుంకుమార్చన, దీప ధూప, నైవేద్యాలతో పూజలు చేశారు. అనంతరం బుధవారం కనీవిని ఎరుగని రీతిలో భక్తులతో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు కలశ, కుంభాలతో ఎంతో భక్తిశ్రద్ధలతో దాదాపు 70 సంవత్సరాల క్రితం జరుపుకున్న దేవర మహోత్సవాలు జరుపుకున్నారు. దేవతకు తెల్లవారుజామున కూష్మాండబలిని నిర్వహించి, దేవత మహోత్సవాలను ప్రారంభించారు. గ్రామ పెద్దలు కెఆర్.లక్ష్మి కాంత్ రెడ్డి, కె.రఘుమూర్తి స్వామి, వైస్ ఎంపిపి నడిపి షేక్ సాహెబ్, సర్పంచి మద్దేశ్వరి, ఎంపిటిసి సుశీలమ్మ ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో దేవరను ప్రశాంతంగా నిర్వహించారు.

ఆయుర్వేద సేవలు సద్వినియోగం చేసుకోండి

- శ్రీమఠం మేనేజర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న గో శ్రీసుజయీంద్ర ఆరోగ్యశాలలో ఉచిత ఆయుర్వేద వైద్య నిపుణులు అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 5, 6న కర్ణాటక రాష్ట్రంలోని మైసూరుకు చెందిన ఆయుర్వేద ప్రత్యేక వైద్య నిపుణులు శ్రీసుజయీంద్ర ఆరోగ్య శాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆయన అందించే వైద్య సేవలను భక్తులు, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బండగట్టు నీటి సరఫరా పునరుద్ధరణ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సాంకేతిక కారణాలతో గ్రామాలకు సరఫరా అయ్యే బండగట్టు రిజర్వాయర్ నీటి సరఫరా బందు కావడంతో నీటి ఎద్దడి నెలకొంది. బండగట్టు నీటి సరఫరాకు అంతరాయం అనే శీర్షిక ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురించిన సంగతి తెలిసిందే. ఇందుకు స్పందించిన సంబంధిత శాఖ అధికారులు విద్యుత్ సాంకేతిక లోపాన్ని సరిచేసి తాగునీటి సరఫరాను యథావిధిగా పునరుద్ధరించడంతో నీటి ఎద్దడి తొలగిందని మండల ప్రజలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో ప్రమాదవశాత్తు వాహనాలు ఢీకొంటున్నాయని, దీనివల్ల భయాందోళనకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలోని బాలికల ప్రభుత్వ హై స్కూల్ సమీపంలోనే ఎస్‌కెడి కాలనీ 6వ రోడ్డులో విద్యుత్ స్తంభం ఉంది. డీఎస్పీ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్‌కు వెళ్లేందుకు స్పీడ్‌గా వాహనాలు కటింగ్ అయ్యే సమయంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనే అవకాశం ఉంది. బుధవారం సాయంత్రం కారు నడిపే వ్యక్తి విద్యుత్ స్తంభం ఢీ కొట్టారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదమూ జరగలేదని స్థానికులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రమాదాలు జరగకుండా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని పక్కకు జరిపి విద్యుత్తు లైను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అవగాహన కల్పించడంలో విఫలం...

- హౌసింగ్ అధికారులపై మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్ ఆగ్రహం

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో జగనన్న కాలనీలో నిర్మాణం అవుతున్న గృహాలు అనుకున్న స్థాయిలో నిర్మాణాలు సాగడం లేదని, దీనిపై లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించడంలో హౌసింగ్ అధికారులు విఫలమవుతున్నారని మండల ప్రత్యేకాధికారి కె.వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నంచర్ల గ్రామంలో జగనన్న కాలనీలో నిర్మాణం అవుతున్న గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు సత్వరమే మెటీరియల్స్ అందజేస్తుందన్నారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేయకపోతే చర్యలు ఉంటాయని హౌసింగ్ అధికారులను హెచ్చరించారు. తాగునీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి సంజన్న, ఎంఇఒ మస్తాన్‌రావు, ఎఒ ఆనంద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామనీలా, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, సూపర్‌వైజర్ ప్రసూన, హౌసింగ్ ఎఇ భవ్య, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, విఆర్‌ఒ రంగన్న పాల్గొన్నారు.

నంచర్లలో జగనన్న కాలనీలో నిర్మాణం అవుతున్న గృహాలను పరిశీలిస్తున్న వేణుగోపాల్

లోకేష్‌కు జననీరాజనం పలుకుందాం

- గంగాధర్ గౌడ్, పాణ్యం తెలుగు యువత అధ్యక్షులు

ప్రజాశక్తి - కర్నూలు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు పాణ్యం నియోజక వర్గంలో జన నీరాజనం పలకాలని పాణ్యం తెలుగు యువత అధ్యక్షులు గంగాధర్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. పాదయాత్ర రెండురోజుల పాటు కల్లూరు మండలంలో సాగుతుందని అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు లోకేష్ ఈ పాదయాత్ర చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసిందన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే టిడిపి అధికారంలోకి రావడమే మార్గమన్నారు.

'యువగళం'ను జయప్రదం చేయండి

- టిడిపి 37వ వార్డు ఇన్‌ఛార్జీ శివ

ప్రజాశక్తి - కర్నూలు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి 37వ వార్డు ఇన్‌ఛార్జీ శివ కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. పాదయాత్ర బుధవారం పాణ్యం నియోజకవర్గంలోకి ప్రవేశించిందని, రెండు రోజులు కల్లూరు మండలంలో సాగుతుందని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలని, టిడిపికి ఈ సారి ఎన్నికల్లో పట్టం కట్టాలని అన్నారు.

దేవాలయాలకు టిటిడి నిధులు మంజూరు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో ఉన్న దేవాలయాల అభివృద్ధికి టిటిడి నుంచి నిధులు మంజూరయినట్లు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక చొరవతో నియోజకవర్గ పరిధిలోని 31 దేవాలయల అభివృద్ధికి టిటిడితో మాట్లాడి, ఒక్కో దేవాలయ అభివృద్ధికి సుమారు రూ.10 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. శ్రీశైలం దేవస్థానం డిఇ చంద్రశేఖర్ శాస్త్రి, ఎఇ రంగ ప్రసాద్ నేతృత్వంలో కోసిగి మండల పరిధిలోని 18 దేవాలయాలను సాతనూరు, అగసనూరు, కందుకూరు, దుద్ది, వందగల్లు, కోసిగి, సజ్జలగుడ్డం, దేవరబెట్ట, జంపాపురం, ఐరనగల్లు, పెద్ద బొంపల్లి, చిన్నబొంపల్లి, దొడ్డి, పల్లెపాడు గ్రామాలను సందర్శించి, నూతన దేవాలయ నిర్మాణానికి అవసరమైన పనులకు సంబంధించి, ఆలయ కమిటీ సభ్యులకు మార్గనిర్దేశం చేశామన్నారు. డిఇ చంద్రశేఖర్ శాస్త్రి, ఎఇ రంగ ప్రసాద్ మాట్లాడుతూ... నియోజకవర్గంలోని కౌతాళం మండలంలో 8, కోసిగి మండలంలో 18, మంత్రాలయం మండలంలో 5 ఆలయ నిర్మాణాలకు టిటిడి వారు ఇప్పటికే అనుమతులు ఇచ్చారని తెలిపారు. త్వరలోనే పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, యువనేత ధరణీ రెడ్డి, మండల ఇన్‌ఛార్జీ మురళీమోహన్ రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ఆదోనిలో తూకాల్లో అక్రమాలు...

- జాడలేని అధికారులు..

- నామమాత్రపు ఉనికి చాటుకుంటున్న తూనికల శాఖ..

ప్రజాశక్తి - ఆదోని

వ్యాపార డివిజన్ కేంద్రంగా, వ్యాపార రంగంలో రెండో ముంబయిగా పేరుపొందిన ఆదోనిలో వ్యాపార సంస్థల్లో తూనికల కొలతల్లో భారీగానే మోసాలు జరుగుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఆదోనిలో నిత్యావసర వస్తువులతో పాటు అనేక ఇతర వస్తువులను, వస్త్రాలను, బంగారు, వెండి ఆభరణాలను, ఎలక్ట్రికల్ వస్తువులను, ముఖ్యంగా రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, క్రిమిసంహారక మందులు ఎరువుల బస్తాలు ఇంకా అనేక వస్తువులను కొనుగోలు చేయడానికి చుట్టుపక్కల వారు అధికంగానే వస్తున్నారు. ఆదోని డివిజన్‌లోని పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరుతో పాటు ఆదోని నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని సురుగుప్ప, బళ్లారి, రాయచూర్, సింధనూర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు, వినియోగదారులు ఎక్కువ శాతం ఆదోనికే వస్తుంటారు. రోజూ ఇతర ప్రాంతాల నుంచి వ్యాపార లావాదేవీల కోసం సుమారు 50 వేల మంది రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలోని పేరు ప్రతిష్టలు సంపాదించి మొదటి స్థానంలో ఉన్న ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోనూ, జిన్నింగ్ పరిశ్రమల్లోనూ పత్తి, వేరుశనగ విత్తనాలు, ఇతర పంటల ఉత్పత్తుల అమ్మకానికి వస్తున్నారు.

మోసాలకు అడ్డా

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని జిన్నింగ్ ఫ్యాక్టరీలోనూ, బయట ప్రాంతంలోనూ ఉన్న వే బ్రిడ్జి కాటాల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. క్వింటాకు 5 నుంచి 10 కిలోల వరకు తూకాల్లో వ్యత్యాసం ఉంటూ, మోసాలకు జరుగుతున్నాయని పత్తి రైతులు వాపోతూనే ఉన్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదోనిలో ఉన్నా ఈ అక్రమాల గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. కేవలం ప్రతినెలా వారి టార్గెట్ల కోసం తనిఖీలు చేస్తున్నారే తప్ప ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నారు. రైతులకు మేలు చేయాలని ఎప్పుడూ తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు చేయడం లేదని రైతు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కొన్ని ఫిర్యాదులు రాగా స్పందించిన కొలతల శాఖ అధికారులు ఇటీవలనే దాడులు నిర్వహించారు. తిమ్మారెడ్డి బస్టాండ్ పక్కన పెట్రోల్ బంక్‌లో ఉన్న బాలాజీ వేయింగ్ బ్రిడ్జిలో 40 కిలోల తేడా వస్తుందని నాన్ స్టాండర్డ్ కింద కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. అధికారులు తనిఖీలు చేసేటప్పుడు అక్రమాలు వెలుగు చూస్తున్నాయని, అక్రమ మొత్తం ఉన్నా దేని గురించి తనిఖీలు చేస్తే ఇంకా అక్రమాలు వెలుగు చూస్తాయని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో వేయింగ్ మిషన్లు పెట్టి కొన్ని ఫ్యాక్టరీలో 50 కిలోల నుంచి వంద కిలోల వరకు రైతులను మోసం చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారి శ్రీరామ్‌ను వివరణ కోరగా... వాటిపై నిఘా ఉంచి త్వరలో పట్టుకుంటామని అన్నారు. బయటవి ఉన్న వేయింగ్ మిషన్స్ కూడా ఫ్యాక్టరీలతో కుమ్మక్కై తూకాలు తేడా చేస్తున్నారని త్వరలో పూర్తి సమాచారంతో దాడులు నిర్వహించి పట్టుకుంటామని తెలిపారు.

పెట్రోల్ బంకులపై కొరవడిన నిఘా

పెట్రోల్ బంకుల్లోనూ తక్కువ కొలతలతో వేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. పెట్రోలు నాణ్యత ఎంత అన్నది కూడా స్పష్టత లేని పరిస్థితి అలాగే కూరగాయల మార్కెట్‌లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని వినియోగదారులు వాపుతున్నారు. అలాగే బంగారు బజార్‌లోను బంగారు, వెండి అభరణాల తూకాల్లోనూ మోసాలు జరుగుతున్నాయని వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నారు. ముఖ్యంగా కూరగాయల హోల్‌సేల్ మార్కెట్లో సైతం ఇలాంటి తూకాలు వేయకుండా బాజ్ పేరిట రైతులను భారీగానే దోచుకుంటున్నారని, మూడు సంచులు విక్రయిస్తే ఒక సంచి బాజ్ కింద పంట ఉత్పత్తులు తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. అలాగే టమోట గంపలను సైతం బాజ్ కింద ఎక్కువ సంఖ్యలో తీసుకుంటున్నారని రైతులు వివరిస్తున్నారు. రైతుల హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో తూకాలు జరగడం లేదని, ఇక్కడ ఎందుకు అధికారులు దాడులు చేయడం లేదని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న అక్రమాలపై ఇటీవల రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేయడం లేదని వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదోని పట్టణంలోని వ్యాపార సంస్థలపై దాడులను ఉధృతం చేసి సక్రమంగా తూకాలు, కొలతలు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యమాలు ఉధృతం : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు ఉధృత ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.కారుమంచి, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ కోరారు. బుధవారం పట్టణంలోని ఎఐవైఎఫ్ కార్యాలయం ముందు పట్టణ, మండల అధ్యక్షులు రమేష్ కుమార్, అంజిత్ గౌడ్ అధ్యక్షతన 64వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. నిరుద్యోగ భృతితోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యార్థి, యువజనులు పోరాటాలు చేయాల్సిన అవసరం ఆవశ్యకత ఉందన్నారు. నాయకులు గిరి, లింగప్ప, మల్లికార్జున, తిప్పయ్య, వెంకటేష్, ప్రసాద్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి విజయ్, భీమేష్ పాల్గొన్నారు. **దేవనకొండ** సిపిఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య 64వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జిల్లా నాయకులు ఎమ్.మనోజ్ అధ్యక్షత వహించారు. ముందుగా పతాకాన్ని ఎఐవైఎఫ్ మాజీ నాయకులు, సిపిఐ మండల కార్యదర్శి నరసారావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. దేశంలో జనాభా కంటే నిరుద్యోగ సమస్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. పాలకుల స్వార్థ ప్రయోజనాల కోసం యువతను పక్కదారి పట్టిస్తూ ఎన్నికల సమయంలో అపద్ధపు హామీలు ఇస్తూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రామాంజనేయులు, ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, రమేష్, ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్, మండల నాయకులు రవి, రంగస్వామి, రాజు, విజయ్ పాల్గొన్నారు. **ఆస్పరి**లోని సిపిఐ కార్యాలయం ముందు మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జెండాను ఆవిష్కరించారు. ఎఐవైఎఫ్ జిల్లా మాజీ సహాయ కార్యదర్శి విరుపాక్షి, సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, ఎఐవైఎఫ్ మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి రంగప్ప, మండల సహాయ కార్యదర్శి దస్తగిరి, మండల ఉపాధ్యక్షులు లేపాక్షి రెడ్డి, నాయకులు దస్తగిరి, రామాంజిని, వీరేష్, రఘు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు : సిపిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

విశాఖ ఉక్కు ఐదు కోట్ల ఆంధ్రుల గుండెచప్పుడు, హక్కు అని సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి తెలిపారు. బుధవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కును ప్రయివేటీకరణ చేసే ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు కొనసాగించాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను, ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. రైల్వే, కృష్ణపట్నం ఓడరేవు పోర్టులను ప్రయివేటీకరణ చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలకడం ఏమిటని మండి పడ్డారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రమేష్, దస్తగిరి, రామాంజనేయ, రంగప్ప, వీరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

సేవా రంగ పరిశ్రమలకు ప్రోత్సాహం

- 166 పరిశ్రమలకు రూ.16.52 కోట్ల సబ్సిడీ మంజూరు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ఉపాధి అవకాశాలు సృష్టించే సేవా రంగ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పరిశ్రమల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 166 సేవారంగ పరిశ్రమలకు రూ. 16.52 కోట్ల సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లైమ్ స్టోన్, సమాచార సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ, క్వారీ స్లాబ్స్ తదితర సర్వీసులకు సంబంధించిన పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించాలన్నారు. బేతంచర్ల స్లాబ్స్, ఆళ్లగడ్డ రాతి శిల్పాలు తదితర వస్తువుల ఎగుమతులకు అవకాశాలు ఎక్కువగా వున్న నేపథ్యంలో ఇందుకోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ ఆమోదించారు. గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్‌లో భాగంగా జిల్లాకు సంబంధించి జెఎస్డబ్ల్యు, అల్ట్రాటెక్, రామ్‌కో, జయజ్యోతి నాలుగు సిమెంట్ పరిశ్రమల కార్యాచరణ ప్రణాళికలపై కలెక్టర్ సమీక్షించారు. కార్యాచరణ అమలులో ఏదైనా సమస్యలు ఉంటే జిల్లా అడ్మినిస్ట్రేషన్ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వివిధ రకాలైన పేలుడు పదార్థాలకు సంబంధించిన లైసెన్సులను నూతనంగా జారీ అయిన మార్గదర్శక సూత్రాల ప్రకారం ఆమోదించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకం (పీఎంఈజీపీ)లో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభ్యర్థులను సంప్రదించి తగురీతిలో సూచనలు జారీ చేయాలని పరిశ్రమల జిల్లా మేనేజర్, లీడ్ డిస్టిక్ మేనేజర్‌ను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎపిఐఐసి జోనల్ మేనేజర్ రామలింగారెడ్డి సూచించిన బేతంచర్ల డ్రైఫోర్ట్ అంశానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాస యాదవ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ రామలింగారెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై నిరసన

- జిల్లా వ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో
- ప్యాపిలిలో మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న నాయకులు
- అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్రుల హక్కు-విశాఖ ఉక్కు నినాదంతో 32 మంది ప్రాణత్యాగం చేసి పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును బిజెపి ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారీ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడం సరైంది కాదని, ప్రభుత్వమే నడపాలని కార్మిక, రైతుసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణనను వ్యతిరేకిస్తూ బుధవారం నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్లో సిఐటియు, ఏఐటియుసిల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు అధ్యక్షులు లక్ష్మణ్, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లలితమ్మ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.రాజశేఖర్‌లు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం తగదన్నారు. ప్రైవేటీకరణ చేస్తే అన్ని రకాల భారాలు పెరగడంతో పాటు ఉద్యోగ భద్రత కార్మికులకు, ఉద్యోగులకు లేకుండా పోతుందని తెలిపారు. వేల ఎకరాల్లో ఉన్న భూమిని కారుచౌకగా కొన్ని సంవత్సరాలపాటు నడిపి తర్వాత చేత కావడం లేదని ఫ్యాక్టరీని మూసి వేల ఎకరాలను సొంతం చేసుకుని వేల కోట్లు సంపాదించుకుంటారని చెప్పారు. కేంద్ర మంత్రులు ఒకసారి ప్రైవేటీకరణ చేయడం లేదని, మళ్లీ రెండు రోజుల తర్వాత తప్పకుండా చేస్తామని ప్రజలను, కార్మికులను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని అన్నారు. వీటన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టేలా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను చేయడం లేదని బిజెపి ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు దాదాపు 400 రోజులపాటు పరిశ్రమలో ఆందోళన నిర్వహిస్తున్నా బిజెపి ప్రభుత్వానికి కనపడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు మోడీకి వ్యతిరేకంగా పోరాడకుండా కార్మికుల దగ్గరకు వచ్చి మద్దతు అని మాయ మాటలు చెప్తున్నాయని, ఢిల్లీలో మోడీ దగ్గరకు వెళ్లి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని కోరడం లేదన్నారు. రాబోయే కాలంలో అన్ని పార్టీలను కలుపుకొని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపేంత వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వెంకట లింగం, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిలు లక్ష్మణ్, నాగరాముడు, ధనుంజయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్యాపిలి :** ప్యాపిలి బస్టాండ్‌లో సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కాన్వాయ్ రావడంతో సిపిఐ, వ్యకాసం నాయకులు కాన్వాయ్‌కి అడ్డంగా నిలబడి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు న్యాయం చేయాలేని నినాదాలు చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సిపిఐ నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం (మిగతా 6వ పేజీలో..)

నంద్యాల పట్టణంలో రాస్తారోకో నిర్వహిస్తున్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్యాపిలిలో కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - మహానంది

మండలంలోని బుక్కాపురం గ్రామ సచివాలయంను సచివాలయ జిల్లా అధికారి జనార్దన్ రావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధికి లక్ష్య సాధన కేంద్రాలే సచివాలయాలు అన్నారు. సచివాలయం సిబ్బందితో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య కార్డులు, బాల్య వివాహాలు, వంటి పలు విషయాలపై ఆరా తీశారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచనలు ఇచ్చారు. అనంతరం మహానందిలోని

ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి మౌలిక వసతుల గురించి ప్రధానోపాధ్యాయురాలు అంబమ్మ, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివ నాగజ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవస్థానంలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలోని అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి రాకను పురస్కరించుకుని ఆలయ ఇఒ రామానుజన్ ఆధ్వర్యంలో పూజారులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభాభిషేకంతో స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి కుటుంబ సభ్యులు అమ్మవారికి కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈవో ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐ పులిశేఖర్, ఎస్సై రామాంజనేయరెడ్డి, మాజీ చైర్మన్ పిఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్ఐ రాఘవేంద్ర, బనగానపల్లె కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అహోబిలంలో హైకోర్టు జడ్జి పూజలు

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి వైశాఖ నరసింహ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఎగువ అహోబిలంలో జ్వాల నరసింహ స్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లను హైకోర్టు జడ్జి బండారు శ్యాంసుందర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి రాకను పురస్కరించుకొని ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో వేద పండితులు ఆలయ మర్యాదలతో, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. డిఎస్‌పి వెంకట రామయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- జాయింట్ కలెక్టర్‌కు రైతు సంఘం నాయకులు వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురుస్తున్న అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, కొర్ర, మిర్చి, పసుపు, నువ్వులు, అరటి, మామిడి తదితర పంటలకు నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రమేష్ కుమార్, ఏ.రాజశేఖర్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతిని కలిసి వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షాలతో జిల్లాలోని చాగలమర్రి, ఆళ్లగడ్డ, రుద్రవరం, మహానంది, గోస్పాడు, బండి ఆత్మకూరు, నంద్యాల, పాణ్యం, మిడ్తూరు, గడివేముల, అవుకు, ఆత్మకూరు మండలాలలో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లోనూ ప్రకృతి అనుకూలించక పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి అందక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని అన్నారు. ఈ సంవత్సరం పంటలు చేతికొస్తున్న సమయంలో అకాల వర్షాలు కురిసి పైరుపై ఉన్న పంటలనే కాకుండా కళ్ళాల్లో ఉన్న పంటలు కూడా తడిసిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. వర్షానికి తడిసిన ధాన్యంను ప్రైవేటు వ్యాపారస్తులు అతి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని చెప్పారు. సరైన కాలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో ధాన్యాన్ని దాచుకోవడానికి అవకాశం కూడా లేక తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ముఖ్యమంత్రి రైతులు పండించిన ప్రతి గింజను కొంటానని ప్రకటించినా ఆచరణలో అమలు చేయలేదన్నారు. రైతులను ఆదుకుంటూ తడిచిపోయిన ధాన్యాన్ని కొని పంటలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, కొర్ర పంటలకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చికి ఎకరాకు రూ.60 వేలు, అరటి, మామిడి, పసుపుకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమాను వర్తింపచేయాలని, బీమా డబ్బు రైతుల అకౌంట్లో జమ చేయాలని కోరారు. నష్టపోయిన పంటలను ఎకరాల వారిగా ప్రభుత్వం నమోదు చేసి ఆర్బికె కేంద్రాల ద్వారా రైతుల జాబితాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రకటించిన జాబితా అన్నింటికీ నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రానున్న ఖరీఫ్‌లో అన్ని రకాల విత్తనాలను రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన.ప్రభాకర్‌కు సరుకులు అందిస్తున్న ఉపాధ్యాయుడు లోకనాథ్ రెడ్డి

హోసన్న వృద్ధాశ్రమానికి చేయూత

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని వైఎస్ నగర్‌లో ఉన్న హోసన్న వృద్ధాశ్రమానికి నెహ్రునగర్‌లో ఉన్న ఉపాధ్యాయుడు లోకనాథ్ రెడ్డి తన తండ్రి పి.శ్రీనివాసరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నిత్యవసర సరుకులు అందించినట్లు వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమానికి సహాయం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు లోకనాథ్ రెడ్డి వృద్ధులను ప్రేమతో పలకరించి వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. సందర్భం ఏదైనా నలుగురికి సహాయం చేయాలనే భావాన్ని ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని సూచించారు.

అర్ధరాత్రి ఎస్‌సి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ బీట్లు జరుగుతున్న విధానాన్ని ఎఎస్‌పి ఆర్.రమణ ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని శ్రీనివాస్ సెంటర్, బాలాజీ కాంప్లెక్స్, ఆత్మకూరు బస్టాండ్, అమ్మవారి శాల,ఎన్జీఓస్ కాలనీ సాయిబాబా నగర్, రైల్వే స్టేషన్ మూలసాగరం, ఎంఎస్ నగర్, బొమ్మల సత్రం తదితర ప్రాంతాలలో పర్యటించి నైట్ బీట్లను చెక్ చేసి సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గస్తీ సమయంలో అనుమానాస్పద వ్యక్తులను చెక్ చేయాలన్నారు. ప్రతి గంటకు ఒకసారి వారి లొకేషన్ వివరాలు నమోదు చేసుకోవాలని కంట్రోల్ రూమ్ అధికారులకు తెలిపారు. గస్తీ నిర్వహించే కానిస్టేబుళ్లకు అనుమానమాస్పద వ్యక్తులను చెక్ చేసి వీలైతే వారి వేలిముద్రలు సేకరించాలని చెప్పారు.

5న టెన్నిస్ క్రికెట్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - చాగలమర్రి/ఆళ్లగడ్డ

చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 5న జిల్లాస్థాయి టెన్నిస్ క్రికెట్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా టెన్నిస్ క్రికెట్ కార్యదర్శి మహబూబ్ భాష బుధవారం తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 5వ తేదీన వారి 10వ తరగతి మార్కులిస్టు జిరాక్సు, ఆధార్ తీసుకుని ఎంపిక పోటీల్లో పాల్గొనాలని చెప్పారు. ఈ నెల 11 నుంచి 13 వరకు స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు దాదాపీర్ పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో టిడిపి నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని కొండపేటకు చెందిన ముస్లిం మైనార్టీ సభ్యులు 60 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో చేరారు. బుధవారం టిడిపికి చెందిన మహ్మద్ రసూల్, ఇసాక్, షరీఫ్, నూర్‌మహ్మద్, హనీఫ్, మాలిక్, షబ్బీర్ తదితర 60 కుటుంబాలకు చెందిన వారికి ఆర్థిక మంత్రి స్వగృహంలో కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఆర్థిక శాఖ మంత్రి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని చేరుతున్నట్లు వారు తెలిపారు. అలాగే ముస్లిం వారికి మదర్సాకు 3 సెంట్ల స్థలాన్ని కేటాయించినందుకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ కండువాలు కప్పుతున్న మంత్రి బుగ్గన

ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - నంద్యాల

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కోసం గతంలో ఇచ్చిన జిఒలు, ఉత్తర్వులు మార్గదర్శకాలను రద్దు చేయడం మోసం చేయడమేనని, ఇప్పటికైనా ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించి వేసవి సెలవులలో చేపట్టాలని, జూన్ 1న నూతన పాఠశాలలో చేరే విధంగా షెడ్యూల్ విడదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి డిమాండ్ చేశారు. బుధవారం యుటిఎఫ్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పివి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 2021లో ఒక్కసారి మాత్రమే బదిలీలు నిర్వహించిందన్నారు. ఈ నాలుగేళ్లలో ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఏ ఒక్క సమస్యను పూర్తిగా పరిష్కరించలేదని తెలిపారు. సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పి జిపిఎస్‌ను తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ఉపాధ్యాయులకు బదిలీలు ప్రతి సంవత్సరం వేసవిలో జరిపే విధంగా చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానం వెంటనే రద్దు చేసి ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవా లన్నారు. జనవరిలో వర్క్ అడ్జస్మెంట్ పేరుతో ప్రమోషన్ పొంది చాలా మంది ఉపాధ్యాయులు దూర ప్రాంతాలలో పని చేసున్నారని, వారి సర్వీస్‌ను జనవరి 27 నుండి లెక్కించి ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత పిఆర్‌సిలో బకాయి పడ్డ డిఏ అరియర్స్, పిఆర్‌సి అరియర్స్‌ను వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరావాధ్యక్షుడు ఎస్.జాకీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, సహ అధ్యక్షుడు ఎల్.సత్య ప్రకాష్, ఆర్థిక కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, అమీర్ అహమ్మద్, ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శులు ఎస్.షమీం బాను, సంధ్యారాణి, పిసిహెచ్ బాలస్వామి, కె.రామకృష్ణుడు, వివి రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి

యూనియన్ అభివృద్ధిలో మునిస్వామి కృషి మరువలేనిది

- మోటారు వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - డోన్

మోటార్ వర్కర్స్ యూనియన్ అభివృద్ధికి కామ్రేడ్ కె.మునిస్వామి అందించిన సేవలు, కృషి మరువలేనివని నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో కె.మునిస్వామి 7వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీనియర్ నాయకులు జి.కొండయ్య పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ న్యాయవాది ఎం.నాగ భూషణం రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షులు ఎన్.నరసింహుడు, మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవి భాస్కర్ రెడ్డి, టి.శివరాంలు పాల్గొని మాట్లాడారు. మోటార్ వర్కర్స్ యూనియన్‌లో లారీ డ్రైవర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించిన కె.మునిస్వామి అంచెలంచెలుగా ఎదుగుతూ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, దాదాపు 30 సంవత్సరాల ఆయన నాయకత్వంలో యూనియన్ ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. సిఐటియు అనుబంధంగా అనేక సంఘాల నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించాడన్నారు. ఆర్టీసీలో డ్రైవర్‌గా ఉద్యోగం వచ్చినా కేవలం కొన్ని నెలలకే ఉద్యోగాన్ని వదులుకొని కార్మికుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అదే మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. అనంతరం స్మశాన వాటికలోని ఆయన స్తూపం దగ్గర ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు మాణిక్యం శెట్టి, మోటార్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు బి.లక్ష్మన్న ఎం.వెంకటరాముడు, కోశాధికారి సుబ్బారెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు బి.నాగ మద్దయ్య, సున్నం బట్టీల హమాలీ యూనియన్ అధ్యక్షులు బి.నాగన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్, లారీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, రామచంద్రుడు, భోగేశ్వర్ రెడ్డి, అజీపీర, మహమ్మద్, మహేష్,శ్రీను, సుధాకర్, మల్లికార్జున, ఐద్వా నాయకురాలు షమీం బేగం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు తెలుగు విజయ్, హరి, ఆవాజ్ కమిటీ నాయకులు అక్బర్, మునిస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నివాళ్లులర్పిస్తున్న నాయకులు

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి : బిఎస్‌పి

ప్రజాశక్తి - కొత్తపల్లి

తెలంగాణ భరోసా యాత్రలో భాగంగా ఈ నెల 7న జరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిఎస్‌పి నందికొట్కూరు అసెంబ్లీ ఇన్చార్జి ఎల్.స్వాములు, తాలూకా నాయకులు పెద్దన్నలు కోరారు. బుధవారం కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామంలో చలో హైదరాబాద్ బహిరంగ సభ కరపత్రాలను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బహిరంగ సభకు బిఎస్‌పి బుధవారం కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామంలో చలో హైదరాబాద్ బహిరంగ సభ కరపత్రాలను వారు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షురాలు బెహన్ మాయావతి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. నందికొట్కూరు నియోజకవర్గం నుండి వేలాదిగా బహుజనులు పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య కుమార్, దేవదాసు, లింగస్వామి, భాస్కర్, వెంకటేశ్వర్లు, నాగరాజు, కిరణ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి : ఎంఇఒ

ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వం పేదలకు కేటాయించిన 25 శాతం ఉచిత సీట్లకు విద్యార్థులు (ఈడబ్ల్యూఎస్) దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ అనురాధ బుధవారం తెలిపారు. బుధవారం చాగలమర్రిలోని ఎంఆర్‌సి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రెండో విడతలో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశాలు కల్పిస్తామని, విద్యార్థుల తరపున ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.

పోరాడి హక్కులను సాధించుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

కార్మికుల హక్కులను పోరాడి సాధించుకోవాలని కార్మిక సంఘం నాయకులు రఘురాంమూర్తి తెలిపారు. బుధవారం పగిడ్యాల బస్టాండ్‌లో 137వ మేడే సందర్భంగా కార్మిక జెండాను ఆయన ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతి కార్మికుడు హక్కుల కోసం పోరాటాలు సాగించినప్పుడే ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు. కార్యక్రమంలో చాంద్ బాషా, అబ్దుల్ రెహమాన్, ఇబ్రహీం, శ్రీను, రఫీ, మస్తాన్ వారి, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాను ఎగరేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

మాండ్ర శివానంద రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో టిడిపి నేత మాండ్ర

ప్రజాశక్తి - పాములపాడు : మండలంలోని మద్దూరు గ్రామంలో భూదేవి, వెంకటేశ్వర స్వామి, సుంకుల పరమేశ్వరి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు గత రెండు రోజుల నుండి ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం టిడిపి నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆయనను గ్రామ నాయకులు, పెద్దలు దుశ్శాలువాలతో సన్మానించారు. గ్రామంలో ప్రతిష్ట అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వేంపెంట సింగిల్ విండో మాజీ అధ్యక్షులు హరి సర్వోత్తమరావు, టిడిపి మండల అధ్యక్షులు హరినాద్ రెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, బండ్లమూరి వెంకటేశ్వరరావు, గోవిందు, జనార్దన్ రెడ్డి, శివశంకర స్వామి, పూసల కృష్ణయ్య, హనుమంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

5న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - డోన్ : ఈ నెల 5న జరిగే డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శశి భూషణ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డయల్ యువర్ డిఎం కార్యక్రమం శుక్రవారం ఉదయం 11 నుండి 12 గంటల వరకు నిర్వహిస్తామని, ప్రయాణికులు, ప్రజలు తమ సమస్యలు, సలహాలు, సూచనలను 9959225795 నెంబర్‌కు కాల్ చేసి తెలపాలని కోరారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : స్థానిక భారతి విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి జంప్ ఛాంపియన్షిప్ పోటీలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. బుధవారం బిజెపి తాలూకా బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి క్రీడా పోటీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను తాను ప్రోత్సహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబటి మహేశ్వర్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను ఎంపిడిఒ తనిఖీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని ఆర్.కృష్ణాపురం, చిన్న కందుకూరు, పెద్ద కందుకూరు, లింగందిన్నె సచివాలయాలను ఎంపీడీవో సుబ్బారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పిఎంజివై, ఎస్డిజి సర్వే, హౌసింగ్, ఈ సర్వీసులు, స్పందన కార్యక్రమాలపై గ్రామ సచివాలయ అధికారులతో సమీక్ష నిర్వహించి వారికి సూచనలు అందజేశారు. ఆయనతోపాటు హౌసింగ్ ఏఈ నరసింహారావు ఉన్నారు. **రుద్రవరం :** సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో మధుసూదన రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. స్పందన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం హౌసింగ్ లేఔట్లను పరిశీలించారు. నిర్మాణం పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు జయరాముడు, విఆర్ఓ నారాయణ, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ ప్రసాదు, ఇంజనీర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మహానంది : మండలంలోని గాజులపల్లె గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవర ఉత్సవాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వైసిపి నాయకుల ఇండ్ల వద్దకు వెళ్లి ఆత్మీయ పలకరింపు చేసి అనంతరం వారి విందును స్వీకరించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా నంద్యాల తాలూకా రూరల్ సీఐ రవీంద్ర, మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ పర్యవేక్షణలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

లోకోస్ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని పొదుపు సంఘాలకు లోకోస్ యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలోని పొదుపు సంఘాలను ఏకీకృతం చేసిందని తెలిపారు. లోకోస్ అంటే ప్రజల ఆపరేటింగ్ సిస్టమని తెలిపారు. గతంలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక విధంగా పొదుపు సంఘాల సిస్టం ఉండేదని, ఇప్పుడు దేశంలో ఒకే విధంగా ఉండేలా లోకోస్ ప్రవేశపెట్టారన్నారు. ఈ యాప్‌ను ఏ విధంగా వినియోగించాలనేదానిపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిసిలు, అకౌంటెంట్లు, వివోఏలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని ఒంటి గుడిసె తండాలో మారమ్మ, సేవాలాల్ మహారాజ్ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు. ప్రతిష్ఠ మహొత్సవానికి విచ్చేసిన ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి గిరిజనులు సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికి గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఎంపిటిసి పత్తి నారాయణ, వైసిపి నాయకులు గణేష్‌రెడ్డి, వీరయ్య, తోడేండ్లపల్లె సర్పంచ్ గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం - రూ. 4 లక్షల నష్టం

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన మహిళా రైతు దేవి సాగు చేసిన 2.5 ఎకరాల మొక్కజొన్న పంట ప్రమాదవశాత్తు నిప్పంటుకుని బుధవారం దగ్ధమైంది. మరో రెండు రోజుల్లో పంటను కోత కోయాలనుకున్న సమయంలో దగ్ధం కావడంతో మహిళా రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బంధువుల ఇంటికి వెళ్లి వచ్చిన తర్వాత పొలానికి వెళ్లగా పంటంతా దగ్ధమైంది. సమాచారాన్ని అందుకున్న ఆళ్ళగడ్డ అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. పంటతో పాటు సమీపంలోని విద్యుత్ మోటారు, పైపులు, స్టాటరు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని భాధిత రైతు కోరారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి : వ్యకాసం

ప్రజాశక్తి - బేతంచర్ల : ఉపాధి కూలీలందరూ ఐక్యమై ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అర్.ఈశ్వరయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఈరాయిపల్లె అర్జున్ తెలిపారు. బుధవారం మండలంలోని కొలుములపల్లె గ్రామ పరిధిలో కంకర క్రషర్ మిషన్ ఫ్యాక్టరీ దగ్గర జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చిందన్నారు. సమ్మర్ అలవెన్స్‌ను, అదనపు వేతనాలను రద్దు చేసిందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలను, ఆదుకోవాలని, పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించి, పనిముట్లు ఇవ్వాలని, పాత పద్ధతిలాగానే పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్.నారాయణ, మేటీలు, కూలీలు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై నిరసన

(5వ పేజీ తరువాయి..) జిల్లా కార్యదర్శి కలచట్ల రాధాకృష్ణ, పి.వెంకటేష్, పిక్కిలి వెంకటేశులు మాట్లాడారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి, కౌన్సిలర్ పి సుంకయ్యని డోన్ పట్టణంలో ఇంటిదగ్గర అరెస్టు చేయడం అప్రజాస్వామన్నారు. నాయకులు రాము, రాఘవేంద్ర, ఆనంద్, కొత్తకోట శ్రీనివాసులు, చిన్న తుమ్మగురుడు, సంజీవ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపుమేరకు ఆత్మకూరు పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ముందు సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సిపిఐ తాలూకా కార్యదర్శి కె.శ్రీనివాసులు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్‌లు మాట్లాడారు. నాయకులు రజాక్, మాభాష, సుధాకర్, వీరన్న, డి.రామ్ నాయక్, సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, సద్దాం హుస్సేన్, ప్రతాప్, అతావుల్లా, అహమ్మద్ హుస్సేన్, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పాములపాడులోని ప్రధాన సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి సామన్న, నాయకులు వెంకటేశ్వరావు, మధు, జయరాజు, మైనార్టీ నాయకులు షర్ఫుద్దీన్ అలీ, కిషోర్ పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలిలో సిపిఎం, సిఐటియు, సిపిఐ, ఏఐటియుసిల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి జివి సుబ్బయ్య, సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి మాట్లాడారు. ఏఐటియుసి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రెటరీ డి శివ బాలకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు శివయ్య, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షులు సంజీవులు, సిఐటియు నాయకులు దస్తగిరి, సిపిఐ మండల నాయకులు శివ నాగయ్య, ఖాదర్, రైతు సంఘం నాయకులు ఇమామ్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **డోన్ :** స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షులు నరసింహులు, సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్‌లు మాట్లాడారు. సిఐటియు పట్టణ కార్యదర్శి శివరాం, సిపిఎం తారకరామ నగర్‌కార్యదర్శి అక్బర్ బాషా, శ్రీరామనగర్‌కార్యదర్శి షేమిమ్ బేగం, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి, ఎస్‌ఎఫ్ఐ మండల కార్యదర్శి విజయ్, కోశాధికారి ఇర్ఫాన్, నాయకులు లక్ష్మన్న, నాగమద్దయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** పట్టణంలోని సిపిఎం కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు మండల కమిటీ సభ్యుడు బి.సంజీవనాయుడు అధ్యక్షతన ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో చేపట్టారు. సిపిఎం పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు వైబి.వెంకటేశ్వర్లు, ఆర్.ఈశ్వరయ్యలు మాట్లాడారు. సీనియర్ నాయకులు వై.ఎల్లయ్య, కె.రాజబాబు, పి.వెంకటరమణ, బాలకృష్ణ, జె.శ్రీనివాసులు, నాగరాజు, యస్.కె.భాష, నాయుడు, గోరంట్ల, రాజు మాలిక్ భాష, రామచంద్రుడు, కోట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడులో...

బనగానపల్లెలో...

డోన్‌లో రాస్తారోకో చేపడుతున్న సిపిఎం, ప్రజా సంఘాల

బేతంచెర్లలో రాస్తారోకో చేపడుతున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

గ్రామాల్లో వైభవంగా పెద్దమ్మ జాతర

- పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని, మాజీ ఎమ్మెల్యే బిసి

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని క్రిష్ణగిరి, పెద్దరాజు పాలెం గ్రామాలలో పెద్దమ్మ జాతరలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ జాతరలలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రిష్ణగిరి, పెద్దరాజుపాలెంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వైసిపి నాయకులు ఈడిగ రమణ గౌడ్, నీలి శంకర్, నీలి మద్ది రెడ్డి, సర్పంచి మూల మోహన్ బాబు గౌడ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సన్నల జనార్దన్ రెడ్డి, నాయకులు చిన్న రాజుపాలెం పాపన్న, ఈశ్వర్ నాయక్, బాల మద్దిలేటి, దత్తు, మూల రమేష్ గౌడ్, కమలాపురి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అలాగే క్రిష్ణగిరి, పెద్దరాజుపాలెంలో మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డికి టిడిపి నాయకులు లక్కీ మధు యాదవ్, రంగస్వామి యాదవ్, మాజీ ఎంపీటీసీ గంధం హుస్సేని,కొండు నడిపి భూషన్న, బాలకృష్ణ, సిబి కృష్ణుడు, పసుపల బాల నాయుడు, షేక్షావలి, కామేష్‌ల ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐలు నవీన్ బాబు, వీరాంజనేయులు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు.

అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అమ్మవారి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

నాడు-నేడు పనులు పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - గడివేముల

నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అధికారులను ఆదేశించారు. బుధవారం గడివేములలోని తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండల అధికారులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన సమస్యలను పెండింగ్ ఉండకుండా త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న నాడు-నేడు పనులను స్కూలు ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం గడివేముల ఎస్సీ కాలనీలో స్పెషల్ స్కూల్‌లో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించారు. స్కూల్‌కు వెళ్లడానికి రస్తా సమస్యను త్వరగా పరిష్కరించాలని మండల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో 11 చోట్ల ఇండ్ల స్థలాలను ఇళ్ల నిర్మాణానికి పంపిణీ చేశారని, కానీ ఒక్క చోట కూడా ఇండ్ల నిర్మాణం చేపట్టలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో గతంలో కొంతమంది రైతులు నకిలీ పత్తి విత్తనాలతో పంట వేసి నష్టపోయారని, ఈ సంవత్సరం నకిలీ విత్తనాలతో నష్టపోకుండా జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని జరుగుతున్న సచివాలయ, రైతు భరోసా, వైఎస్ఆర్ వైద్య భవన నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని మండల పంచాయతీరాజ్ శాఖ అధికారికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ శివ మల్లేశ్వరప్ప, వ్యవసాయ అధికారి హేమ సుందర్ రెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి జబీన్, ఏపిఎం ఉస్మాన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పాల దశలో నేలవాలిన వరి

- రైతులకు తీవ్ర నష్టం

పడిపోయిన వరి పైరును కట్టలు కడుతున్న రైతులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

బండి ఆత్మకూరు మండలంలో ఇటీవల రెండు మూడు రోజులుగా కురుస్తున్న అకాల గాలి వానలకు పాలు పోసుకునే దశలో ఉన్న వరి పంటలు నేలవాలాయి. తెలుగు గంగ ఆయకట్టు కింద రబీ సీజన్లో రైతులు వరి పంట దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

మండలంలోని రామాపురం, సంత జుటూరు, సింగవరం, జిసి పాలెం, జి.లింగాపురం, నారాయణపురం, చిన్నదేవలాపురం, పెద్దదేవలాపురం గ్రామాల్లో తెలుగు గంగ ఆయకట్టు కింద రైతులు వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట పాలు పోసుకునే దశలో ఉంది. వడగండ్ల వర్షాల బాధ తప్పిందనుకుంటున్న క్రమంలో గాలివానలు రావడంతో వరి పొలాలు నేలవాలాయి. పాలు పోసుకునే దశలో వర్షం రావడంతో పంటంతా నేలకొరిగింది. వేలాది ఎకరాల్లో వరి పొలాలు నేలకొరిగాయి. ప్రభుత్వం మాత్రం ఇంతవరకు ఆదుకునేందుకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. తమను ఆదుకునే నాధుడు లేడని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసే రైతన్నపై ప్రకతి కన్నెర్ర చేయడంతో కోలుకోలేని దెబ్బ పడింది. పడిపోయిన వరి పొలాలు గింజ సరిగా రాక తాలు ధాన్యంగా తయారవుతుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లో వరి పొలాలు పడిపోయిన దృశ్యాలను తీసి ఉన్నతాధికారులకు పంపించారు. అయితే ఇంతవరకు జిల్లా కలెక్టర్ నుండి వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ నుండి బాధితులను గుర్తించేందుకు ఆదేశాలు రాకపోవడం ప్రభుత్వం నిమ్మకు నీరెక్కినట్లు ఉందని రైతులు విమర్శిస్తున్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం వచ్చే విధంగా పంటల బీమా ఉన్నా ప్రభుత్వం చర్యలు చేపట్టడంలో మీనవేశాలు లెక్కించడం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మండలంలో నష్టపోయిన వారి వివరాలను నమోదు చేసి ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

రైతన్నలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

నారాయణపురం గ్రామంలో మేము సాగు చేసిన వరి పొలాలు నేల ఒరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. నోటికాడికి వచ్చిన పంట ఇలా నష్టపోవడంతో దిక్కు తోచడం లేదు. పంటల నష్టం బీమా ఉన్న నష్టపరిహారాన్ని గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైంది. వెంటనే ప్రభుత్వం నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలి.

షేక్ మొదున్ షావలి, రైతు, నారాయణపురం.

రైతన్నలకు నష్టపరిహారాన్ని చెల్లించాలి

అకాల వర్షాలకు నష్టపోయిన రైతన్నలకు నష్ట పరిహారాన్ని చెల్లించాలి. అకాల వర్షాల కారణంగా పాలు పోసుకునే దశలో వరి పొలాలు నేలమట్టం అయ్యాయి. అధి కారులు బాధితులను గుర్తించడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. జాతీయ పంటల భీమా పథకం ద్వారా రైతులను ఆదుకోవాలి. పంట చేతికి వచ్చే సమయంలో ఇలా ప్రకతి కన్నెర్ర చేయడం రైతు దురదృష్టకరం. రైతన్నలను ఆదుకునేందుకు వెంటనే చర్యలు చేపట్టాలి.

- మద్దినేని శంకరయ్య, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు. నారాయణపురం గ్రామం.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పత్రిక స్వేచ్ఛ మూలం : సిపిఐ

ప్రజాశక్తి - నందికొట్కూరు

దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పత్రిక స్వేచ్ఛ చాలా అవసరమని, నిజాన్ని నిర్భయంగా రాసే పాత్రికేయులకు స్వేచ్ఛ ఉండాలని సిపిఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి, పాత్రికేయుల సంఘం నాయకులు నాగేష్, లాయర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవంను నందికొట్కూరు పాత్రికేయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి, విలేకరుల సంఘం నాయకులు నాగేష్, లాయర్ వెంకటేశ్వర్లు, సిపిఐఎంఎల్ నాయకులు నరసింహులు సంయుక్తంగా ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ కేకును కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత్రికేయులపై దాడులు సరికాదన్నారు. సమాజ శ్రేయస్సుకోసం అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్న పాత్రికేయుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ నాయకులు కాటెపోగు నాగ సురేష్, టిడిపి మండల కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, వైసిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ పసుల శ్రీనివాస నాయుడు , పాత్రికేయులు, మీడియా మిత్రులు జయరాజు, గోపి, రామకృష్ణ, జలీల్, నాగరాజు, స్వామన్న, సుధాకర్, ఉమర్ బాషా, చిన్న మారెన్న, ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షులు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న నాయకులు

సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

టిడిపి తప్పుడు ప్రచారం చేస్తోంది : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి జరుగుతుంటే సహించలేని తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎల్లో మీడియా విమర్శలు, ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం తగదని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని 10వ వార్డు ముల్లాన్ పేటలో రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని 42 వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వార్డు కౌన్సిలర్ అబ్దుల్ మస్జిద్, మున్సిపల్ అధికారులు, వైసిపి కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సమయం వృధా.. పరిష్కార మార్గాలేవి..?

- వేల్పనూరు సర్పంచి ఆవేదన

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు మండల సర్వసభ సమావేశానికి ప్రజా ప్రతినిధులు కొంతమంది రాకపోవడంతో సమయం వృధా అవుతుందే కాని సమస్యలకు పరిష్కార మార్గాలేవి కనబడడం లేదని వేల్పునూరు సర్పంచ్ సర్దార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వెలుగోడు ఎంపిడిఒ అమానుల్లా ఆధ్వర్యంలో ఎంపీపీ రమేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, కొందరు అధికారులు సైతం నిర్ణీత సమయానికి హాజరు కాలేదు. ముఖ్యంగా తహశీల్దారు అసలే లేరని, ఆయన ఎప్పుడొస్తాడో ఎవరికి తెలియదని, ఉన్న ఉప తహశీల్దార్ కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో లోలోపల మధన పడే వారు కూడా ఉన్నారు. సర్వసభ్య సమావేశం నామ మాత్రంగా నిర్వహించి మమ అనిపించారు.

ఘనంగా భూలక్ష్మి చెన్నకేశవ స్వామి తిరుణాల

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలో భూలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి తిరుణాల బుధవారం ఘనంగా ప్రారంభమైంది. రాజ వంశస్థులైన నంద్యాల త్రివిక్రమ వర్మ మొదటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చల్లా కుటుంబ సభ్యులైన దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి పెద్ద కుమారుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, చల్లా సోదరులు భాస్కర్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాజ వంశస్థులు నంద్యాల త్రివిక్రమ్ వర్మ, పోతిరెడ్డి చంద్రహాస రెడ్డిలు పూజలు నిర్వహించి టేకు పల్లకిని విరాళంగా దేవస్థానానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

అధిక పని దినాలు కల్పించాలి

- ప్రత్యేక అధికారి విజయలక్ష్మి

ప్రజాశక్తి - పగిడ్యాల

ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు అధిక పని దినాలు కల్పించాలని ఉపాధి హామీ పథకం ప్రత్యేక అధికారి విజయలక్ష్మి సిబ్బందికి ఆదేశించారు. బుధవారం పగిడ్యాలలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధి పనులు వేగవంతం చేయాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికి పలును కల్పించాలని ఆదేశించారు. కూలీలకు ప్రతిరోజు రూ.272 వేతనం వచ్చేలా కూలీలకు మార్కింగ్ వేసి పనులు చేయించాలన్నారు. కూలీల సంఖ్య పెంచాలన్నారు. ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం జరిగినా, కూలీలకు పనులు కల్పించకపోయినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటరమణ, ఎపిఒ మద్దిలేటి, ఇసి అశోక్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పదవికి మంచి పేరు తేవాలి : మంత్రి బుగ్గన

- ప్యాపిలి సొసైటీ చెర్మన్‌గా బోరెడ్డి రాము

ప్రజాశక్తి - ప్యాపిలి

యువకుడు, ఉత్సాహవంతుడు, ప్రజలతో, రైతులతో సత్సంబంధాలు కలిగిన బోరెడ్డి రాము ప్యాపిలి సొసైటీ చైర్మన్‌గా రాణించి పదవికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్యాపిలి సొసైటీ చెర్మన్‌గా ఎన్నికైన బోరెడ్డి రాము అభినందన సభ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాపిలి మండలంలో లోకేష్ పాదయాత్ర వచ్చినపుడు మాట్లాడిన తీరు హాస్యస్పదంగా ఉందని, డోన్ నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి జరిగింది అన్నారని, మీరు నడిచే రోడ్డు కనిపించడం లేదా అని, రెండుసార్లు ఎన్నికైన తాను ఇంత అభివృద్ధి చేశానని తెలిపారు. బాబు 14 సంవత్సరాలలో కుప్పంలో ఏమి అభివృద్ధి చేశారని సవాల్ విసిరారు. స్క్రిప్ట్ రాసుకొని మాట్లాడే లోకేష్ అభివృద్ధి గురించి ఏమి తెలుసుకోకుండా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. పెద్ద పాయలో రేపు నెలలో రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపిసిలో 976 మార్కులు సాధించిన మానసను మంత్రి అభినందించారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు సంద్రపల్లి నుంచి పిఆర్ పల్లె వరకు సుమారు 8 కిలోమీటర్లు మేర మంత్రి పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో మీట్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పిటిసి బోరెడ్డి శ్రీరామరెడ్డి, డోన్ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి, తహసీల్దార్ చంద్ర శేఖరవర్మ, ఎంపిడిఒ ఫజల్ రహిమాన్, ప్రస్తుత డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, మాజీ జెడ్పిటిసి దిలీప్ చక్రవర్తి, సచివాలయ మండల కన్వీనర్ బోరామల్లికార్జున రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, ఉప సర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, జయచంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రెడ్డి, విగ్నేశ్వర రెడ్డి, నిజాముద్దీన్, ఎస్కేవలి, షాషావలి, పాండు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, ALLAGADDA

O.S.No.355/2019

Chaduvula Nageswara Reddy. ...PLAINTIFF

- VS-

Vempalle Chenchannagari Hussain Reddy. ...DEFENDANTS

SUMMON TO THE DEFENDANT

Vempalle Chenchannagari Hussain Reddy,
S/o. Nagi Reddy,
R/o. H. No.6-5-8,
New Mosque Street,
Allagadda - Town,
Nandyal - District.

Whereas the above named suit filed by the plaintiff against you for realization of debt, You are hereby required to appear in the court on the 12-05-2023 in person or by pleader duly instructed and able to answer all the materials questions related to the above proceedings. ALSO take notice in default of your appearance on the aforesaid day. The issue will be settled and the petition heard and determined in your absence. You shall also bring will you or send by your pleader and document which the petitioner desires to inspect and any document on which you intent to rely in support of your defence.

By order of the court

C. V. RAMANA RAO,
ADVOCATE FOR PLAINTIFF

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE, ALLAGADDA

I.A.No.603/2019 IN O.S. No.355/2019

Chaduvula Nageswara Reddy. ...PLAINTIFF

- VS-

Vempalle Chenchannagari Hussain Reddy. ... DEFENDANTS

NOTICE TO THE RESPONDENT

Vempalle Chenchannagari Hussain Reddy,
S/o. Nagi Reddy,
R/o. H. No.6-5-8,
New Mosque Street,
Allagadda - Town,
Nandyal - District.

Whereas the above named petition filed a petition against the Respondent for attachment of petition schedule property before judgement you are hereby required to appear in the Court on the 12-05-2023 in the forenoon in person or by pleader duly instructed and able to answer all the meterials question related to the above proceedings. ALSO take notice in default of your appearance on the aforesaid day. The issue will be settled and the petition heard and determined in your absence. You shall also bring will you or send by your pleader and document which the petitioner desires to inspect and any document on which you intent to rely in support of your defence.

By order of the court

C.V. RAMANA RAO,
ADVOCATE FOR PETITIONER